A1TV NEWS

APTEL 2023/16425

నేటి ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి
నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ
పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు
ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు,
మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)
సెల్: 8121133006
9494220260
ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంచిక :01 సంపుటి : 112 బుధవారం నవంబర్ 08- 2023 పేజీలు 4. వేల :4 /



# పేదలకు మంచి చేసాం కాబట్టే..
# ప్రజలు వారి గుండెల్లో పెట్టుకున్నారు.

**- వైయస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ నిధులను విడుదల చేసిన జగన్.**

**- ఒక్కొక్కరికి రూ.4,000 చొప్పున 53.53 లక్షల మంది రైతన్నలకు రూ.2,204.77 కోట్ల రైతు భరోసా సాయం**

ఆంధ్ర ప్రగతి పుట్టపర్తి నవంబర్ 07:
పంట సీజన్‌లో నష్టం జరిగితే అదే సీజన్‌లో ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తున్నాం.. గడిచిన 4 ఏళ్లలో రూ.60 వేల కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేశాం.రైతన్న బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నమ్మిన ప్రభుత్వం తమదని, గత ప్రభుత్వానికి మనందరి ప్రభుత్వానికి మధ్య ఎంత తేడా ఉందనేది ప్రతి రైతన్నా ఆలోచించాలని సీఎం జగన్ స్పష్టం చేశారు. వైయస్సార్ రైతు భరోసా- పీఎం కిసాన్ కింద వరుసగా ఐదో ఏడాది 2వ విడత పెట్టుబడి సాయాన్ని అందించే కార్యక్రమాన్ని సీఎం జగన్ శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో సీఎం జగన్ రైమాట్లాడుతూ... రాష్ట్రంలోని 53.53 లక్షల మంది రైతన్నలకు మంచి జరిగిస్తూ ఈ కార్యక్రమం అయిపోయిన వెంటనే బటన్ నొక్కి నేరుగా దాదాపు రూ.2,200 కోట్లు జమ చేసే మంచి కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామని సీఎం పేర్కొన్నారు. ఈరోజు రేపటి లోపు మన ప్రభుత్వం తరఫున ఇవ్వాల్సిన రూ.1,200 కోట్లు నేరుగా ప్రతి రైతన్న ఖాతాలో జమ అవుతుందన్నారు. ఇక పీఎం కిసాన్ కింద రావాల్సిన రూ.1,000 కోట్లు వాళ్లు ఇచ్చిన వెంటనే ప్రతి రైతన్న ఖాతాలో జమ అవుతుందన్నారు.

ఈ 53 నెలల్లోనే రైతుకు, రైతాంగానికి మనందరి ప్రభుత్వం ఎంతగా మద్దతిచ్చిందో అందరికీ తెలిసిందేనని సీఎం జగన్ పేర్కొన్నారు. చంద్రబాబు 14 సంవత్సరాలు సీఎంగా ఉండి కూడా ఎందుకు మీ బిడ్డ జగన్ చేసిన పనులను చేయలేకపోయాడో ఆలోచన చేయాలన్నారు. ఈ 53 నెలల కాలంలో 53 లక్షల పైచిలుకు రైతన్నలకు మంచి జరిగిస్తూ, ప్రతి రైతన్నకు నేరుగా బటన్ నొక్కి ఖాతాల్లోకి జమచేయడం వల్ల ఒక్కొక్కరికి దాదాపు రూ.65,500 ఇవ్వడం జరిగిందన్నారు. అయిదో విడత కింద రూ. 4వేలను ఒక్కో రైతు ఖాతాల్లో జమచేసేందుకు రూ.2,200 కోట్లు ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. కేంద్రంతో సంప్రదించి రూ.1000 కోట్లు వెంటనే విడుదల చేయాలని కోరతానని సీఎం జగన్ తెలిపారు. కేవలం రైతు భరోసా పథకం ద్వారానే దాదాపు 53 లక్షల పైచిలుకు రైతులకు రూ.33,209 కోట్లు ఆ అయిదేళ్లలో వారి ఖాతాల్లోకి నేరుగా పంపగలిగామన్నారు.

గత కొన్ని రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలు చేపట్టిన సామాజిక సాధికార యాత్రకు స్పందన బాగుందని సీఎం జగన్ తెలిపారు. రైతులుగానీ, అవ్వాతాతలుగానీ, అక్కచెల్లెమ్మలుగానీ, చదువుకొనే పిల్లలు గానీ నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ నా నిరుపేద వర్గాలు గానీ, ఈ వర్గాలకు మంచి చేస్తే, ఇచ్చిన ప్రతిమాటా నిలబెట్టుకుంటే వారెంతగా తమ గుండెల్లో స్థానం ఇస్తారని చెప్పడానికి ఒక వైయస్సార్ గారిని చూసినా ఒక జగన్ ను చూసినా అర్థం అవుతుందన్నారు. ఇదే విషయం సామాజిక సాధికార యాత్రలను చూసినా కనిపిస్తోందన్నారు. నా ఎస్సీలను, నా ఎస్టీలను, నా బీసీలను, నా మైనార్టీలను నాయకత్వ రోల్ లోకి తీసుకొచ్చి వాళ్ల చేత మీటింగులు పెట్టిస్తున్నా తండోపతండాలుగా జనాలు కదిలి వస్తున్నారంటే ఎంతగా ప్రతి పేద వాడి గుండెల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థానం ఉందో నిదర్శనంగా కనిపిస్తోందన్నారు. మీ బిడ్డ జగన్ కు ఎంత స్థానం ఉందో చెప్పడానికి ఈ మీటింగులే నిదర్శనమని, ప్రతి అడుగూ రైతన్నకు మంచి జరగాలి, పేద వాడికి మంచి జరగాలి, నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీ,లు, నా మైనార్టీలు బాగుండాలి, కుటుంబాలు బాగుండాలి, పిల్లలు బాగుండాలి, గొప్పగా చదవాలి, ఎదగాలని ఎంతో తపిస్తూ అడుగులు వేసిన ప్రభుత్వం మనదని సీఎం స్పష్టం చేశారు.


# జగన్ సర్కార్ తప్పుడు కేసులపై గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన నారా లోకేష్.



ఆంధ్ర ప్రగతి విజయవాడ నవంబర్ 07:
రాష్ట్రవ్యాప్తంగా ప్రజల తరపున ఎవరు పోరాడున్నారో, ఎవరు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారో%ొా% వారిపై దొంగకేసులు పెట్టి వేధిస్తున్న తీరును గవర్నర్ కు తెలియజేశామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పేర్కొన్నారు. జగన్ ప్రభుత్వంలో జరుగుతున్న అరాచకం, కక్షసాధింపు చర్యలపై ఈరోజు లోకేష్ నేతృత్వంలో టిడిపి ప్రతినిధి బృందం విజయవాడ రాజ్ భవన్ లో గవర్నర్ అబ్దుల్ నజీర్ ను కలిసి వినతిపత్రం అందజేసింది. అనంతరం లోకేష్ మీడియాతో మాట్లాడుతూ%ొా% రాష్ట్రంలో రాజ్యాంగాన్ని కాపాడాల్సిన బాధ్యత గవర్నర్ పై ఉంది, ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే రోజుల్లో దక్షిణ భారతదేశంలో ఎపి మరో బీహార్ లా మారబోతోందని గవర్నర్ కు చెప్పాం. జగన్ కు నరనరాన కక్షసాధింపు తప్ప ఏమిలేదని ఆధారాలతో సహా గవర్నర్ కు వివరించాం, ప్రతిపక్షంపై ఎలా కక్ష సాధింపునకు పాల్పడుతున్నారో చెప్పాం, సీనియర్ నాయకులు అచ్చెన్న, కొల్లు రవీంద్ర, ధూళిపాళ నరేంద్రను నెలల తరబడి ఎలా జైలుకు పంపించారో వివరించాం, జెసి ప్రభాకర్ రెడ్డిపై ఎలా వంద కేసులు పెట్టి వేధిస్తున్నారో తెలియజేశాం.

**మిగతాది 4లో...**

# చంద్రబాబు కంటికి కాటరాక్ట్ ఆపరేషన్.



ఆంధ్ర ప్రగతి హైదరాబాద్ నవంబర్ 7:
ఏపీ మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబుకు హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో శస్త్ర చికిత్స పూర్తయింది. ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి వైద్యులు ఆయనకు విజయవంతంగా కాటరాక్ట్ ఆపరేషన్‌ను నిర్వహించారు. చంద్రబాబుకు 45 నిమిషాల్లో కాటరాక్ట్ ఆపరేషన్‌ను వైద్యులు పూర్తి చేశారు. ఆపరేషన్ ముగిసిన వెంటనే ఆయన జూబ్లీహిల్స్‌లోని తన నివాసానికి బయలుదేరారు. మరో వారం రోజుల పాటు చంద్రబాబు విశ్రాంతి తీసుకోనున్నారు. మరోవైపు చంద్రబాబును చూసేందుకు పెద్ద సంఖ్యలో టీడీపీ అభిమానులు ఆసుపత్రికి వచ్చారు. చంద్రబాబు కంటి ఆపరేషన్ విజయవంతం కావడం పట్ల టీడీపీ శ్రేణులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టయిన చంద్రబాబు 50 రోజులకు పైగా రాజమండ్రి జైలులో ఉన్నారు. ఈ నేపథ్యంలో కంటికి ఆపరేషన్ నేపథ్యంలో షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా.. టీడీపీ–జనసేన పార్టీలు పొత్తు ప్రకటన తర్వాత ఉమ్మడి కార్యాచరణ దిశగా ముందుకు కదులుతున్నాయి. ఇప్పటికే రెండు పార్టీల నుంచి ఉమ్మడి కమిటీల నియామకం జరిగింది. వైసీపీని గద్దె దించడమే లక్ష్యంగా ముందుకెళ్తామని రెండు పార్టీలు ప్రకటించిన సంగతి తెలిసిందే.

# అవినీతి అక్రమాలను ప్రశ్నిస్తే టిడిపి కోవర్ట్ అంటారా.?



ఆంధ్ర ప్రగతి పుట్టపర్తి, నవంబర్ 07:
రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తే తెదేపా కోవర్టు అంటారా అని భాజపా రాష్ట్ర శాఖ అధ్యక్షురాలు పురందేశ్వరి మండిపడ్డారు.శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి పార్టీ బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇన్‌ఛార్జుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించకూడదా? అలాచేస్తే ప్రతిపక్షాల గొంతు నొక్కుతారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మద్యం అక్రమాలపై కేంద్ర హోంమంత్రికి ఫిర్యాదు చేశానని చెప్పారు.రాష్ట్రంలో కేంద్ర నిధులతో నూతన జాతీయ రహదారులను నిర్మిస్తున్నారని, ఆ పనులను కూడా తామే చేస్తున్నట్లు రాష్ట్ర పాలకులు చెప్పడం సిగ్గుచేటన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు వైకాపా ప్రభుత్వం స్టిక్కర్లు వేసుకుని, పాలన కొనసాగిస్తోందని విమర్శించారు. నిరుపేదలకు 18 లక్షల ఇళ్లు కేటాయిస్తే ఎన్ని నిర్మించారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో భాజపా, జనసేన మధ్య పొత్తు కొనసాగుతుందని చెప్పారు. దానిపై పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని, పొత్తు లేకుంటే 175 స్థానాలకు భాజపా అభ్యర్థులు బరిలో ఉంటారని పేర్కొన్నారు.

# వైసిపి పై వ్యతిరేకత సరే .. టిడిపికి గెలుపు గుర్రాలక్కర్లేదా..?

ఆంధ్ర ప్రగతి అమరావతి నవంబర్ 07:
ఏపీలో మరో ఆరు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అయితే ఇప్పటినుండే పార్టీలు తమ అస్త్రాశస్త్రాలను సిద్ధం చేసుకుంటున్నాయి. అధికార పార్టీ వివిధ పథకాలు, ఉద్యోగ నోటిఫికేషన్లతో సిద్ధమవుతుంటే ..టీడీపీ, జనసేన కూడా మినీ మ్యానిఫెస్టో రిలీజ్ చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది. అధికార, ప్రతిపక్షాలు ఎవరి వ్యూహాల్లో వారు ఉన్నారు. ఎవరికివారు తమ తమ కార్యకలాపాల స్పీచ్ ను పెంచేశారు. సీఎం జగన్ ను ఎదుర్కొవడం కోసం టీడీపీ అధినేత చంద్రబాబు, ప్రభుత్వంపై ఉండే వ్యతిరేక ఓటును చీలకుండా ఉండేందుకు జనసేన అధినేత పవన్ తో పొత్తు కలిసి పోరుకు రెడీ అయ్యారు.

వైసీపీ ప్రభుత్వం పై వ్యతిరేకత ఉందని భావిస్తూన్న ప్రతిపక్షాలు.. దాన్ని క్యాష్ చేసుకోవాలని టీడీపీ, జనసేన తపించిపోతున్నాయి. అయితే వైసీపీపై వ్యతిరేకతే ఉంటే దాన్ని ఒడిసిపట్టడానికి టీడీపీ, జనసేనలో సరైన అభ్యర్థులు ఉన్నారా.. ? అన్న సందేహాలు కలుగుతున్నాయి. టీడీపీలో చంద్రబాబు, లోకేశ్ ఇప్పటికే పలువురికి గెలుపు గుర్రాలు కాకపోయినప్పటికీ సీటిస్తామని కమిట్ అయి ఉన్నారు. మరి వారిని ఎలా గెలిపించుకుంటారో వేసిచూడాల్సి ఉంటుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. **మిగతాది 4లో...**

# బంజారాల చలో తిరుపతి కార్యక్రమాన్ని విజయవంతం చేయండి.

ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 07:

నంద్యాల పట్టణంలోని ఉన్న ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం కార్యాలయంలో చలో తిరుపతి గోడ పత్రికను విడుదల చేసిన ఏఐబిఎస్ఎస్ రాష్ట్ర జిల్లా నాయకులు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చలో తిరుపతి కార్యక్రమాన్ని ప్రతి ఒక బంజారా సోదరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఎన్నో ఏళ్ల సంవత్సరాల నుండి తిరుమలలో అక్కడ హతీరాం బాబ్జి మఠం ఉన్న విషయం అందరికీ తెలిసిందేనని అయితే నేడు హథిరాం బాబ్జి మఠం లేకుండా చేయాలని కొంతమంది చూస్తున్నారని
వాటిని అందరం ఈ నెల 10,11వ తేదీన కలిసికట్టుగా హతిరాం బాబ్జి మఠాన్ని కాపాడుకోవాలని అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు.
తిరుమల తిరుపతి దేవస్థానంలో ఉన్న కలియుగ దైవం అయినటువంటి ఏడుకొండల వెంకటేశ్వర స్వామికి నిత్యం స్వామివారికి నైవేద్యం హథిరాం బాబ్జి మఠం నుండే వస్తుందని అలాంటి మఠాన్ని నేడు



తొలగించాలని అన్న ఆలోచన రావడం చాలా బాధాకర విషయమని ఇప్పటికైనా ప్రతి ఒక్క బంజారా నాయకులు పార్టీలకు అతీతంగా పాల్గొని యువకులు, విద్యార్థులు వివిధ పార్టీలకు చెందిన నాయకులు కలిసి చలో తిరుపతి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఈ కార్యక్రమానికి వివిధ రాష్ట్రాల నుండి మన జాతి నాయకులు చాలామంది వస్తున్నారని కాబట్టి ఇప్పటికైనా అందరం ఏకమై హాథిరాం బాబ్జి మఠం కాపాడుకోవాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర నాయకులు బిలావత్ శంకర్ నాయక్ ,ఆత్మకూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ విక్రమ్ సింహ నాయక్ ,ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర నాయకులు డుమావత్ స్వామి నాయక్, ఎస్.కె బాలా నాయక్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు విజయ్ నాయక్ ,సుధాకర్ నాయక్, బంజారా ధర్మరక్షణ సమితి చందు నాయక్ అడ్వకేట్ బాలు నాయక్, అశోక్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# వైఎస్ఆర్సీపీ కి భారీ షాక్..

## - టిడిపిలోకి 100 కుటుంబాలు.

ఆంధ్ర ప్రగతి ఆత్మకూరు నవంబర్ 07:
ఆత్మకూరులో మున్సిపాలిటీలో అధికార వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగిలింది, త్యాగరాజు కాలనీకి చెందిన సుమారు 100 కుటుంబాలు ఆ పార్టీని వీడి మంగళవారం మేడం శ్రీనివాస యాదవ్, పెరుమాళ్ళ డేవిడ్ ల ఆధ్వర్యంలో శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

# న్యూస్ క్లిక్ మీడియా ప్రతినిధుల అరెస్టు సరైంది కాదు.

**-సిఐటియు, ఏపీడబ్ల్యూజేఎఫ్ నేతలు హెచ్చరిక..**

ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 07:
మీడియా స్వేచ్ఛను కేంద్రం అణిచివేస్తుందని అందులో భాగంగానే న్యూస్ క్లిక్ (వెబ్ ఛానల్ )యజమాని ప్రభిర్ పురకాయస్త, అడ్మినిస్ట్రేట్ మేనేజర్ అభిజిత్ చక్రవర్తి లను అరెస్టు చేయడాన్ని ప్రజాతంత్ర వాదులు అందరూ ఖండించాలని సీఐటీయూ జిల్లాఅధ్యక్ష, కార్యదర్శులు వి. ఏసు రత్నం,ఎ. నాగరాజు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు టి. మద్దులు,ఏపీడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు డి. మౌలాలి, నంద్యాల పట్టణ కార్యదర్శి ఎ.జగన్ మోహన్ లు కోరారు. అక్రమంగా అరెస్టు కాబడిన న్యూస్ క్లిక్ వెబ్ ఛానల్ యాజమాన్యాన్ని తక్షణమే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.కేంద్రం లో మీడియాపై నరేంద్ర మోడీ ప్రభుత్వం జరుపుతున్న దాడులకు నిరసనగా నంద్యాల పట్టణంలోని నూనెపల్లె కోవెలకుంట్ల జంక్షన్ నందు జీవోని దగ్ధం చేసి నిరసన చేపట్టారు.ఈ కార్యక్రమానికి సిఐటియు పట్టణ అధ్యక్షులు డి. లక్ష్మణ్ అధ్యక్షత వహించగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ నాగరాజు, అధ్యక్షులు వి ఏసురత్నం, జిల్లా ఉపాధ్యక్షులు తోట మద్దులు, పట్టణ కార్యదర్శి కే మహమ్మద్ గౌస్ ,కోశాధికారి వెంకటలింగం , ఏపీ డబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు మౌలాలి, పట్టణ కార్యదర్శి జగన్ మోహన్, ఉపాధ్యక్షులు యలనాటి జాషువా, సహాయ కార్యదర్శి ఇక్బాల్ నాయకులు శ్రీనివాస్, రాజేష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజా సమస్యలను రైతాంగ సమస్యలను ఎత్తిచూపుతో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ స్వేచ్ఛగా వార్తలు ను ప్రచారం చేస్తున్న న్యూస్ క్లిక్ ఎఫ్ ఛానల్ పై ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆఫీసుల పైన ఐటి దాడులు నిర్వహించి యాజమాన్యాన్ని భయభ్రాంతులకు గురిచేయడం సరైంది కాదన్నారు. బెదిరింపు పాల్పడుతున్న కేంద్ర ప్రభుత్వ ధోరణిని నాయకులు తీవ్రంగా ఖండించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టే వీడియోస్ ను



భరించలేక న్యూస్ క్లిక్ కార్యాలయం పై దాడులు చేయడం అవివేకమన్నారు.ప్రభిర్ పురకాయస్త, అడ్మినిస్ట్రేట్ మేనేజర్ అభిజిత్ చక్రవర్తి లను మానసికంగా వేధించడం యావత్ భారతదేశం గమనిస్తుందని మీడియా రంగం పైన ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని వారు హితవు పలికారు. కేంద్రానికి అనుకూలంగా లేని పత్రికల పైన యాజమాన్యాల పైన కక్ష సాధింపు ధోరణికి పాల్పడటం మోడీ ప్రభుత్వానికి తగలదన్నారు. ఇలాంటి చర్యలతో పాల్పడితే భవిష్యత్తులో ప్రభుత్వాలు మూల్యం చెల్లించుకోక తప్పదని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కార్యకర్తలు జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.సందర్భంగా వారు మాట్లాడుతూ నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత మీడియా రంగంపై ఆంక్షలు పెరిగిపోయాయని విమర్శించారు న్యూస్ క్లిక్ ప్రతినిధులు మరియు 16 మంది పాత్రికేయులపై ఉపా చట్టం కింద కేసులు బనాయించారని ఇది తీవ్రమైన అన్యాయం అని అన్నారు భారతదేశంలో మీడియా స్వేచ్ఛ మరింత దిగజారిందని వారు తెలియజేశారు. 180 దేశాలలో మన భారతదేశం మీడియా స్వేచ్ఛలో 161 స్థానంలో ఉందని అన్నారు విరు చేసిన నేరమంతా గత సంవత్సరం జరిగిన రైతు ఉద్యమాన్ని ప్రపంచానికి తెలియజేయడమేనని వారు తెలియజేశారు. న్యూస్ క్లిక్ కు విదేశాల నుండి ఆర్థికంగా సహాయమందుతుందనే పేరుతో వారిని అరెస్టు చేయడం దారుణమన్నారు ఎవరి ద్వారా అయితే డబ్బులు అందాయని వారు ఆరోపిస్తున్నారో నెల్లివెల్లి రాయి సింగం అనే అమెరికావామపక్షవాది నేను న్యూస్ క్లిక్ కి ఎటువంటి ఆర్థిక సహాయం అందజేయలేదని తెలిపారు 1975- 77 మధ్యన విధించిన విమర్జెన్సీ కంటే భయంకరమైన పరిస్థితులు ఈరోజు ఉన్నాయని వారు విమర్శించారు ఎవరైతే ప్రభుత్వంలో ఉన్న లోపాలను విమర్శిస్తారో వారిని అర్బన్ నక్సలైట్లుగా ముద్ర వేసి శిక్ష విధించేటువంటి ప్రయత్నం కేంద్ర ప్రభుత్వం చేస్తుందని అన్నారు స్టాన్ స్వామిని ఆ రకంగానే జైలులో ఉంచి మరణానికి కారణమైందని వరవరరావు సాయిబాబు లాంటి వాళ్ళని ఇప్పటికీ హింసిస్తున్నారని వారు తెలియజేశారు. ఒకవైపు ప్రజల పైన భారాలు వేస్తూ భారాలకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న వారి పైన కక్ష సాధింపు చర్యలు పూనుకోవడం సరైనది కాదని ఇటువంటి విధానాలు మానుకోవాలని తెలియజేశారు రాబోవు కాలంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక కక్ష సాధింపులకు వ్యతిరేకంగా జరుగు ప్రజా ఉద్యమాలలో ప్రజలందరూ పాల్గొనాలని కోరారు గతంలో మీడియా స్వేచ్ఛను హరించిన పార్టీలకు,రాజకీయ నాయకులకు ఎంతోమందికి ప్రజలు బుద్ధి చెప్పారని ఇదేవిధంగా న్యూస్ క్లిక్ పై ఆగడాలను ఆపకపోతే ప్రభుత్వానికి పుట్టగతులు లేకుండా చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు

# మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయండి.



ఆంధ్ర ప్రగతి బేతంచెర్ల నవంబర్ 07:
నవంబర్ 11 న జరగబోయే మాదిగల విశ్వరూప మహాసభకును లక్షలాదిగా తరలిరావాలి కోరుతూ పాణ్యం సిమెంట్ జూనియర్ కళాశాలలో కరపత్రాలు విడుదల చేయడం జరిగిందని ఎమ్మెస్ ఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు అనిల్ మాదిగ తెలిపారు.మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకులు మాన్య శ్రీ మందకృష్ణ మాదిగనేతృత్వంలో.. ఈ నెల 11 వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు హైదరాబాదులోని "పరేడ్ గ్రౌండ్స్" నందు జరుగు మాదిగల విశ్వరూప మహా సభకు మాదిగలు, ఇతర ఉప కులాలు లక్షలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని నంద్యాల జిల్లా ఎం ఎస్ ఎఫ్ అధ్యక్షులు అనిల్ మాదిగ పిలుపునిచ్చారు. మంగళవారం మాన్యశ్రీ మంద కృష్ణ మాదిగ అన్న ఆదేశాల మేరకు బేతంచెర్ల మండలం లోని పాణ్యం సిమెంట్ జూనియర్ కళాశాల లో మాదిగ మరియు ఉపకులల విద్యార్థుల తో మీటింగ్ ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మాదిగల విశ్వరూప మహాసభకు ముఖ్యఅతిథిగా భారత ప్రధాని నరేంద్ర మోడీ హాజరవుతున్నట్లు తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డా.బి.ఆర్. అంబేద్కర్ నాడు దళితులకు రిజర్వేషన్లు కోరుకోవడం ఎంత న్యాయమైనదో, దళితుల్లో ఉన్న ప్రతి ఉపకులానికి వారి వారి జనాభా నిష్పత్తికి అనుగుణంగా రిజర్వేషన్ ఫలాలు దక్కేలా... ఎస్సీ వర్గీకరణ జరగాలని నేడు ఎమ్మార్పీఎస్ కోరుకోవడం కూడా అంతే న్యాయమైనదని తెలిపారు. షెడ్యూల్ కులాల ఏబిసిడి రిజర్వేషన్లను సాధించుకునే సమయం ఆసన్నం అయ్యిందని మాదిగల చిరకాల ఆకాంక్ష,29 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం నెరవేరబోతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎం ఈ ఎఫ్ నాయకుల ఎల్లారాజు ఎమ్మెస్ ఎఫ్ నాయకులు కిరణ్, స్టాలిన్, శ్యామ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# మరోసారి వైఎస్ఆర్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి.

## -ఎమ్మెల్యే శిల్పారవి రెడ్డి.



ఆంధ్ర ప్రగతి గోస్పాడు నవంబర్ 07:
నంద్యాల గోస్పాడు మండలంలోని యాలూరు గ్రామంలో ఉదయం 7 గంటల నుండి 168 వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నంద్యాల శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పాల్గొన్నారు.ముందుగా గ్రామ వైసిపి నాయకులు అందరూ ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకొని అక్కడికక్కడే వారి సమస్యలను అధికారుల ద్వారా తీర్చడం జరుగుతుందని అదేవిధంగా గ్రామాలలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే రావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్ఆర్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి ప్రజలను కోరారు.
ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు శకుంతలమ్మ, యాల్లూరు సొసైటీ ప్రెసిడెంట్ రామసుబ్బారెడ్డి, వైసిపి నాయకులు బెక్కెం నాగేశ్వర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు పి పి జనార్ధన్ రెడ్డి ,గ్రామ సర్పంచ్ గడ్డం రత్నమ్మ ఎంపీటీసీ లు భూరం భారతి, జజ్జరి కళ్యాణి బెక్కెం రామచంద్రారెడ్డి బెక్కెం రామేశ్వర్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి ,కైప శివరామిరెడ్డి ,మరియు గ్రామ వైసిపి నాయకులు పాల్గొన్నారు.

# సుగుణమ్మ ను ఆర్థికంగా మోసం చేసిన కమ్మ వెంకటేశ్వర్లు పై కేసు నమోదు చేయాలి.

## -సుగుణమ్మ పోరాటానికి మహిళా ఐక్య వేదిక మద్దతు.

ఆంధ్ర ప్రగతి కర్నూలు నవంబర్ 07:
సుగుణమ్మను ఆర్థికంగా మోసం చేసిన వెంకటేశ్వర్లు పై చీటింగ్ కేసు నమోదు చేయాలని యస్సీ యస్టీ బిసి మైనార్టీ మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి డిమాండ్ చేశారు. స్థానిక కల్లూరులోని వెంకటేశ్వర్లు ఇంటి ముందు కురువ సుగుణమ్మ చేస్తున్న న్యాయ పోరాటానికి మహిళా ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి, కర్నూలు, నంద్యాల జిల్లా అధ్యక్షురాళ్ళతో కలిసి అండగా నిలబడి సుగుణమ్మకు మద్దతు నివ్వడం జరిగింది. ఈ సందర్భంగా పట్నం రాజేశ్వరి మాట్లాడుతూ కమ్మ వెంకటేశ్వర్లు రియల్ ఎస్టేట్ వ్యాపారం ముసుగులో మహిళలను ఆర్థికంగా మోసం చేయడం దారుణమని ఆమె అన్నారు. కురువ సుగుణమ్మ కల్లూరులోని కమ్మ వెంకటేశ్వర్లు ఇంటి ముందు కూర్చొని చేస్తున్న న్యాయ పోరాటం ఏదైతే వుందో అది ఈ రోజుకు రెండవ రోజు వివరాల్లోకి వెళితే, కల్లూరు మండలం పర్ల గ్రామానికి చెందిన కురువ సుగుణమ్మ ఆమె భర్త కె.పి.అమీన్ మరో ఇద్దరు వ్యక్తులు కలిసి కమ్మ వెంకటేశ్వర్లు దగ్గర మూడు ఎకరాల తొంభై నాలుగు సెంట్ల భూమిని కొనుగోలు చేయడం జరిగింది. అందుకు అడ్వాన్సుగా అరవై రెండు లక్షల రూపాయలు కమ్మ వెంకటేశ్వర్లుకు సుగుణమ్మ ఆమె భర్త మరియు భాగస్థులు కలిసి ఇవ్వటం జరిగింది. ఏడు నెలలకు పూర్తి డబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఇద్దరూ అగ్రిమెంట్ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఏడు నెలలకు డబ్బులు సర్దుబాటు చేసుకుని వెంకటేశ్వర్లును సుగుణమ్మ మరియు ఆమె భాగస్థులు కలిసి రిజిస్ట్రేషన్ పెట్టుకుందామని వెంకటేశ్వర్లను అడిగారు. అందుకు వెంకటేశ్వర్లు భూమి ధర పెరిగిందని, పెరిగిన ధర ప్రకారం అమ్ముతానని చెప్పాడు. దాంతో సుగుణమ్మ మేము కట్టిన డబ్బులు వాపసు ఇవ్వు లేకపోతే భూమి అయినా ఇవ్వు అని వెంకటేశ్వర్లను అడిగారు. వెంకటేశ్వర్లు డబ్బులు తిరిగి ఇస్తాను ఇస్తాను అంటూ కాలయాపన చేసి తర్వాత ఇచ్చేది లేదని ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోపో అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడం జరిగిందని బాధితురాలు సుగుణమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. సుగుణమ్మ పన్నెండు సంవత్సరాలుగా న్యాయం కోసం రాజకీయ నాయకుల చుట్టూ, పోలీసు స్టేషన్ చుట్టూ తిరిగి తిరిగి అలిసిపోయి చివరకు మహిళా ఐక్య వేదికను ఆశ్రయించడం జరిగింది. నాల్గవ పట్టణ పోలీసు స్టేషన్ ఎస్సై మధుసూదన్ మరియు పోలీసులు వచ్చి కురువ సుగుణమ్మను మరియు కమ్మ వెంకటేశ్వర్లును ఇరువురిని స్టేషన్ కు రమ్మని సమస్య పరిష్కారం చేద్దామని తీసుకుని వెళ్ళారు. సి.ఐ రేపు ఉదయం 11.00 గంటలకు ఇరువురిని స్టేషన్లో కూర్చోబెట్టి మాట్లాడిస్తామని చెప్పారు. కమ్మ వెంకటేశ్వర్లు రియల్ ఎస్టేట్ వ్యాపారం ముసుగులో మహిళలను ఆర్థికంగా మోసం చేసుకుంటూ పోతుంటే కమ్మ వెంకటేశ్వర్లు అల్లుడు అయిన డి.యస్.పి. యుగంధర్ బాబు ఆ మోసాలను సమర్థించడం సరికాదని పట్నం రాజేశ్వరి అన్నారు. మహిళలకు అండగా నిలబడాల్సిన పోలీసు అధికారి బంధుత్వం పేరుతో మహిళలను మోసం చేసేవారికి అండగా వుండటం బాధాకరమని ఆమె తెలిపారు.పోలీసు ఉన్నతాధికారులు సదరు డి.యస్.పి.పై వారి మామ కమ్మ వెంకటేశ్వర్ల మోసాలపై సమగ్రంగా దర్యాప్తు జరిపించాలని బాధితురాలికి న్యాయం జరిగేలా చూడాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా ఐక్య వేదిక టీమ్ పాల్గొన్నారు.



# వైయస్ఆర్సీపీని ఆదరించేందుకు ప్రజలు మరోసారి సిద్ధం.

**-డిప్యూటీ సీఎం అంజాద్ బాషా.-కోట్ల జనం గుండె గొంతుకైనవాడు జగనన్న. -డిప్యూటీ సీఎం నారాయణస్వామి.**

**ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీలమైన మన కోసం పోరాడేవాడు, పౌరుషం ఉన్నవాడు మన నాయకుడు జగన్. -మాజీ మంత్రి అనీల్ యాదవ్.**

ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ సెప్టెంబర్ 07:
వర్షం కురుస్తున్నా లెక్కచెయ్యకుండా ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. జన ప్రభంజనంతో సభా స్థలి సంద్రాన్ని తలపించింది. స్థానిక ఎమ్మెల్యే బ్రిజేంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో సాగిన సామాజిక సాధికారక యాత్రలో డిప్యూటీ సీఎంలు అజాంద్ బాషా, నారాయణస్వామి, మాజీమంత్రి అనిల్కుమార్యాదవ్, ఎంపీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొని బహిరంగ సభలో మాట్లాడారు.

గత ప్రభుత్వంలో చంద్రబాబు అన్ని సామాజిక వర్గాలను మోసం చేయడమే కాకుండా.. అబద్ధపు వాగ్దానాలతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని అంజాద్బాషా అన్నారు. కానీ, వైయస్ఆర్సీపీ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రం అభివృద్ధి చెందడం మాత్రమే కాదు.. అన్ని సామాజిక వర్గాలు బాగుపడ్డాయి. ఇలా అన్నిరకాలుగా రాష్ట్రాన్ని సుభిక్షంగా పరిపాలిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్ అని, అంతేకాకుండా దేశంలో ఎక్కడా లేని విధంగా 50 శాతం రిజర్వేషన్లతో అన్ని వర్గాల వారికి న్యాయం చేస్తున్నారని ఆంజాద్ బాషా గుర్తు చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాం కాబట్టే ప్రజల్లోకి సామాజిక సాధికార యాత్ర ద్వారా ధైర్యంగా వెళ్లగల్గుతున్నామని, కానీ, చంద్రబాబు మాత్రం ఎన్నికల సమయంలో మరోసారి ప్రజల్ని మభ్యపెట్టేందుకు మాయమాటలు చెబుతున్నారని, ప్రజలు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని అంజాద్ బాషా సూచించారు.

సామాజిక న్యాయమంటే నినాదం కాదు విధానమని చాటి చెబుతున్నారు ముఖ్యమంత్రి జగన్ అని, ఎన్నికలు వస్తున్నాయంటే చాలు ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు మైనార్టీలు నా వాళ్లే అంటూ చంద్రబాబు కల్లబొల్లి మాటలు చెబుతారని మంత్రి నారాయణ స్వామి అన్నారు. నవరత్నాలతో ప్రజలకు మంచి చేస్తుంటే చంద్రబాబు, ప్రతిపక్ష పార్టీలు కడుపు మంటతో ఉన్నాయని మండిపడ్డారు. తన ప్రభుత్వంలో బీసీలను ఏనాడు పట్టించుకోని చంద్రబాబు.. ఇప్పుడు మాయమాటలు చెప్తే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని చెప్పారు. పవన్ కల్యాణ్ కాపుల ఓట్ల కోసం చంద్రబాబుకు లబ్ధి చేకూర్చేందుకు ప్రాకులాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఎస్సీలుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా? అని చంద్రబాబు మాట్లాడం పై చంద్రబాబుకు ఎస్సీలపై ఎంత ప్రేమ ఉందో అర్థం అయ్యిందని, బీసీలను ,ఎస్సీలను నాడు చంద్రబాబు అవమానిస్తూ మాట్లాడిన మాటలెవరూ మర్చిపోరని మండిపడ్డారు. చంద్రబాబు వెన్నుపోటు చరిత్ర రాష్ట్రం దేశం అంతా తెలుసని చంద్రబాబు ఎన్ని కుయుక్తులు చేసిన ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో నమ్మరని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలందరికీ నవరత్నాల పథకాలతో మంచి చేస్తుంటే చంద్రబాబు, ప్రతిపక్ష పార్టీలు కడుపు మంటతో ఉన్నాయని విమర్శించారు.

వర్షాన్ని సైతం లెక్కచెయ్యకుండా తరలివచ్చిన జగనన్న అభిమానుల్ని చూస్తుంటే, 2024లో జగనన్న గెలిచితీరతాడనడంలో సందేహమే లేదని మాజీ మంత్రి అనీల్ యాదవ్ సంతోషం వ్యక్తం చేశారు. తండ్రీ ఆరెస్టై జైల్లో ఉంటే కన్న కొడుకు ఢీల్లికి వెళ్లీ కూర్చున్నాడు, కానీ, దత్తపుత్రుడు రోడ్డు మీద పడుకుని పోరాటం చేశాడు, ఇలాంటి చోద్యం ఇప్పటి వరకు ఏ రాజకీయ నాయకుడు చేసుండడాని మాజీ మంత్రి అనీల్ యాదవ్ ఎద్దేవా చేశారు. పక్కనోడు సీఎం అవ్వాలని పార్టీ పెట్టే వ్యక్తి మనకు అవసరమా? అని ప్రశ్నించారు ఇక్కడేమో టీడీపీతో అంటాడు, తెలంగాణలో బీజేపీతో పొత్తు. టీడీపీకి అక్కడేమో కాంగ్రెస్తో లోపాయికారీ ఒప్పందం. మళ్లీ మనం వెనక్కి పోదామా ముందుకు పోదామా అని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలంతా ఆలోచన చేయాలి అని అన్నారు. రాయలసీమ అంటే పౌరుషాల గడ్డని, ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీలమైన మన కోసం పోరాడేవాడు, పౌరుషం ఉన్నవాడు మన నాయకుడు జగన్ అని మాజీ మంత్రి ఉద్ఘాటించాడు. నిరుపేదవర్గాలకు





మంచి చేసిన మన నాయకుడి వెంట ఉందామని నినాదించారు.

“సంక్షేమపథకాల వెల్లువతో బడుగు బలహీనవర్గాల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు జగన్మోహన్రెడ్డి. విద్యావ్యవస్థలో, ఆరోగ్యరంగంలో జగనన్న విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 95శాతం అమలు చేసిన సీఎం జగన్మోహన్రెడ్డి, ఇప్పటికి 99శాతం హామీలు అమలు చేశారు. దేశచరిత్రతో కనీవినీ ఎరుగని రీతిలో నవరత్నాల్లోని సంక్షేమ పథకాల ద్వారా పేదల ఖాతాల్లోకి రూ.2.40లక్షల కోట్లను డీబీటీ ద్వారా జమ చేశారు. ఇందులో 75శాతం నిధులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే చేరాయి” అని ఎంపీ చంద్రశేఖర్ పేర్కొన్నారు.



# బనగానపల్లి పట్టణంలో టిడిపి పార్టీకి షాక్...

ఆంధ్ర ప్రగతి బనగానపల్లె నవంబర్ 07:
బనగానపల్లె పట్టణంలోని తెలుగుదేశం పార్టీకి చెందిన ముస్లిం మైనారిటీ లు అషరఫ్, జైను సలీం షాబూల్, మహబూబ్ పిరా, సెక్రటరీ ఖాజామోద్దీన్, మౌలాలి, కరిముల్లా, మహమ్మద్ గౌస్, పటాన్ అమీర్, అబ్బాస్ జాబీర్, గౌస్, మారుఫ్ ,అబ్దుల్లా అమీర్,వెంకటేష్ తదితరులు బనగానపల్లె నియోజకవర్గ శాసనసభ్యులు కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో టిడిపి పార్టీని వీడి వైఎస్ఆర్ పార్టీలో చేరారు. వైఎస్ఆర్ పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బనగానపల్లె నియోజకవర్గ శాసన సభ్యులు కాటసాని రామిరెడ్డి మాట్లాడుతు బనగానపల్లె నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి బనగానపల్లె పట్టణానికి చెందిన టిడిపి పార్టీ మైనార్టీ నాయకులు కార్యకర్తలు మంగళవారం నాడు టిడిపి పార్టీని వీడి వైఎస్ఆర్ పార్టీలో చేరడం జరిగిందని వీరందరికీ పార్టీలో సమిచితస్థానం కల్పిస్తానని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. బనగానపల్లె పట్టణంలో ముస్లిం మైనారిటీల కొరకు 68 లక్షల రూపాయలతో స్మశాన వాటికలో ప్రహరీ గోడలను నిర్మించడం జరుగుతుందని 40 లక్షల రూపాయలతో షియా మతస్తులకు ఇబాదత్ ఖానాను నిర్మించడం జరుగుతుందని తెలిపారు. ముస్లిం మైనార్టీల కొరకు షాదిఖాన నిర్మాణం కొరకు కోటి 20 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేయడం జరిగిందని త్వరలోనే షాది ఖానా భూమి పూజ కూడా మొదలు పెడతామని చెప్పారు. తెలుగుదేశం పార్టీ నాయకులు ముస్లిం మైనార్టీల కొరకు ఏం అభివృద్ధి చేశారో పట్టణ ముస్లిం మైనారిటీలకు బాగా తెలుసు అని ఎవరి హయాంలో మైనార్టీల అభివృద్ధిని ఆకాంక్షించి అభివృద్ధి జరిగిందో మైనార్టీ ప్రజలకు తెలుసు అని చెప్పారు. రోడ్డు వెడల్పు కార్యక్రమంలో ఎన్నో అవరోధాలను అధిరోహించి రోడ్డు వెడల్పు కార్యక్రమం పూర్తి చేయడం జరిగిందని వీటిని కూడా తెలుగుదేశం పార్టీ నాయకులు రాజకీయంగా వాడుకోవడం వారి విజ్ఞతకే వదిలి వేస్తున్నానని చెప్పారు. ఈ కార్యక్రమంలో బనగానపల్లె నియోజకవర్గం వైఎస్ఆర్ పార్టీ యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి గారు, వైఎస్ఆర్ పార్టీ నాయకులు అబ్దుల్ ఫైజ్, అత్తర్ జాహీద్ హుస్సేన్, అబ్దుల్ ఖైర్, సైకిల్ షాప్ మహబూబ్ అలీ, హసన్, కిషోర్, సునార్ ఆసిఫ్ భాష, రియల్ ఎస్టేట్ యూనిస్, కలాం, మోక్యార్, అత్తర్ అఖిల్ హుస్సేన్, ఖానిక్, బబ్లూ , సికిందర్, శాషా,షేక్ బురాన్,మహబూబ్ బాషా, వైఎస్ఆర్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైఎస్సార్ రైతు భరోసా క్రింద రైతులకు రూ.96.68కోట్లు జమ.

**-జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్.**

ఆంధ్ర ప్రగతి నంద్యాల, నవంబర్ 07:
దేశంలో ఎక్కడా లేనివిధంగా కౌలు రైతులు, దేవాదాయ భూములు సాగు చేసుకునే రైతులకు వరుసగా ఐదవ ఏడాది రెండవ విడతగా జిల్లాలో వైఎస్సార్ రైతు భరోసా క్రింద అర్హులైన 2,33,969 మందికి రూ.96.68 కోట్లు జమ చేశామని జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్ తెలిపారు.

మంగళవారం శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తి బహిరంగ సభ నుంచి మంగళవారం వరుసగా ఐదవ ఏడాది.. రెండవ విడతగా డా.వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన 53.53 లక్షల మంది రైతన్నలకు రూ 2,204.77 కోట్ల రైతు భరోసా పిఎం కిసాన్ ఆర్థిక సహాయాన్ని పంపిణీని బటన్ నొక్కి నేరుగా జమ చేసే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్, ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్ర బోతుల పాపిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు వంగాల భరత్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ మైనార్టీ సలహాదారుడు హబీబుల్లా, మున్సిపల్ ఛైర్పర్సన్ మాబున్నిస్సా, నంద్యాల మండల అధ్యక్షుడు ప్రభాకర్, ఏపిఎస్పిడిసిఎల్ డైరెక్టర్ శశికళ రెడ్డి, ఏంఎస్ఏంఈ డైరెక్టర్ అబ్దుల్ కలామ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ మహేశ్వర రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు ,మండల వ్యవసాయ అధికారులు, రైతులు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ వరుసగా ఐదో ఎడాది రెండవ విడతగా జిల్లాలో వైఎస్సార్ రైతు భరోసా క్రింద అర్హులైన 2,33,969 మంది రైతులకు రూ.96.68 కోట్లు జమ చేశామన్నారు. దీంతోపాటు ఈ క్రాఫ్ బుకింగ్, పంటల భీమా ప్రీమియం, వైయస్సార్ యంత్ర సేవ పథకం కింద పరికరాలు, నాణ్యమైన విత్తన సరఫరా, సీడ్ విలేజ్ ప్రోగ్రాం తదితర కార్యక్రమాల లబ్ధిని కూడా రైతులకు అందిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు.

ఆళ్లగడ్డ నియోజకవర్గానికి సంబంధించి 48,990 మంది రైతులకు రూ.20.36కోట్లు, బనగానపల్లె నియోజకవర్గానికి సంబంధించి 44,488 మంది రైతులకు రూ.18.29 కోట్లు, డోన్ నియోజకవర్గానికి సంబందించి 37,375 మందికి రూ.15.38కోట్లు, నందికొట్కూరు నియోజకవర్గానికి సంబంధించి 42,302 మందికి రూ.17.49కోట్లు, నంద్యాల నియోజకవర్గానికి సంబంధించి 16,112 మందికి రూ.6.66కోట్లు, పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి 15,649 మంది రైతులకు రూ.6.45కోట్లు, శ్రీశైల నియోజకవర్గానికి సంబంధించి 29,053 మంది రైతుల ఖాతాల్లోకి రూ.12.01కోట్లు వెరసి మొత్తం 2,33,969 మంది రైతులకు రూ.96.68 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం జమ చేసి రైతులకు అండగా నిలిచిందని జిల్లా కలెక్టర్ వివరించారు.

ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్ర బోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్క రైతుకు నాలుగు వేల రూపాయలు చొప్పున రైతు భరోసా పిఎం కిసాన్ ఆర్థిక సహాయాన్ని అందిస్తోందన్నారు. అర్హులైన రైతులకు ప్రతి సంవత్సరం మూడు విడతల్లో రూ.13,500/-లు ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు.

వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో కౌలు రైతులకు కూడా పెద్ద ఎత్తున రైతు భరోసా ఆర్థిక లబ్దిని రాష్ట్ర ముఖ్యమంత్రి చేకూరుస్తున్నారన్నారు. అటవీ భూములు సాగు చేసుకునే రైతులకు కూడా రైతు భరోసా సహాయాన్ని



అందించారన్నారు. ఈ ఏడాది జిల్లాలో 10 వేల మంది కౌలు రైతులకు సిసిఆర్సి కార్డ్స్ పంపిణీ చేశారన్నారు.

అనంతరం అతిధులు రైతు సోదరులకు రైతు భరోసా, పంట నష్టపోయిన రైతన్నలకు ఇన్పుట్ సబ్సిడీ మొత్తాల చెక్కును అందచేశారు

# జహీరాబాద్ కు పట్టిన దరిద్రం పోవాలంటే హరీష్ రావు ను పారద్రోలాలి

(జహీరాబాద్,నవంబర్ 6



జహీరాబాద్ ప్రజలు అమాయకపు ఏమ్మెల్యే ను గెలిపించడం ద్వారా ఇక్కడ ఏ పని జరగలన్న హరీష్ రావు అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని మాజీ మంత్రివర్యులు,కాంగ్రెస్ ఏమ్మెల్యే అభ్యర్థి ఏ. చంద్రశేఖర్ అన్నారు.సోమవారం రోజు “వస్తున్నా.. మీ కోసం”కార్యక్రమంలో భాగంగా జహీరాబాద్ పట్టణంలో రెండవ రోజు డాక్టర్ ఏ. చంద్రశేఖర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ ఏ.చంద్రశేఖర్ మాట్లాడుతూ... బంగారు తునకలాంటి జహిరాబాద్ ను హరీష్ రావు, కేటిఆర్ ,కేసీఆర్ లు పంచుకొని,ఇక్కడి నిధులు మళ్ళీంచుకుపోతున్నరని అన్నారు.కేసీఆర్ ప్రభుత్వం గడిచిన పది సంవత్సరాలుగా ఇంటికో ఉద్యోగం,దళితులకు ముడుఎకరల భూమి అని ఎవరికి ఇవ్వలేదు మాట్లాడారు.పట్టణంలో రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థను పట్టించుకోకుండా పన్నుల రూపంలో వచ్చిన నిధులను హరీష్ రావు సిద్దిపేటకు తరలించుకు పోతున్నారని విమర్శించారు.ఇక్కడి నిధులు ఎత్తుకుపోతుంటే స్థానిక ఎమ్మెల్యే అడగడం లేదని మండిపడ్డారు.జహీరాబాద్ కు పట్టిన దరిద్రం పోవాలంటే హరీష్ రావు ను పారద్రోలాలని మాట్లాడారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి మహిళకు 2500 రూపాయలు అందిస్తామని,ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవడానికి 5 లక్షల రూపాయలు అందిస్తామని అన్నారు.అలాగే 18 సంవత్సరాలు నిండిన విద్యార్థినులకు ఎలక్ట్రానిక్ స్కూటీలు అందిస్తామని అన్నారు.కేసీఆర్ 10 సంవత్సరాలు జూటామాటలు చెప్పి ప్రభుత్వాన్ని నడిపి లక్షల కోట్లు సంపాదించుకోని డబ్బులతో గెలవాలని చూస్తున్నారని అన్నారు.పట్టణంలో కాంగ్రెస్ పార్టీ మద్దతుగా ప్రజలు తండోపతండాలుగా వస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇక్కడి నిధులు ఇక్కడి అభివృద్ధి కోసం ఖర్చు చేస్తామన్నారు.కాంగ్రెస్ పార్టీ చెయ్యి గుర్తుకు ఓటేసి జహీరాబాద్ కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గం ఇంచార్జ్ ఉజ్వల్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు కండెం నరసింహులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# క్లాప్ డ్రైవర్ల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలి.

ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 07:



నంద్యాల జిల్లా కేంద్రంలోని నంద్యాల పట్టణంలో ఇంటింటి దగ్గరికి వెళ్లి చెత్త సేకరణ చేస్తూ నంద్యాల పట్టణ పరిశుభ్రత కోసం నిరంతరం కృషి చేస్తున్న క్లబ్ డ్రైవర్ల కు గత నాలుగు నెలలుగా పెండింగ్ వేతనాలు రెడ్డి ఎంటర్ప్రైజెస్ చెల్లించకపోవడం వలన డ్రైవర్ల కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయని సిఐటియు పట్టణ అధ్యక్షులు డి లక్ష్మణ్ అన్నారు ఈ సమస్యను పరిష్కారం చేయాలని కోరుతూ నంద్యాల మున్సిపల్ కమిషనర్ రవిచంద్ర రెడ్డి గారికి సమస్యలతో కూడిన వినతిపత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో డ్రైవర్లు శ్రీను,ఇమ్రాన్, నారాయణరెడ్డి, చానియా, ఖాజా, ఆనందరావు, పోల.కిట్టు, నాగేశ్వరరావు లు పాల్గొనడం జరిగింది.

అనంతరం సిఐటియు పట్టణ అధ్యక్షులు లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన క్లాప్ పథకం చాలా ఆర్భాటంగా ప్రారంభమైన నాటినుండి నేటి వరకు అనేక ఇబ్బందులు డ్రైవర్లు ఎదుర్కొంటున్నారని రాయలసీమ వ్యాప్తంగా కాంట్రాక్టు తీసుకున్న రెడ్డి ఎంటర్ప్రైజెస్ డ్రైవర్ల పట్ల చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని వారి కుటుంబాలతో చెలగాటమాడుతుందని నెలల తరబడి పెండింగ్లో వేతనాలను ఉంచడం ద్వారా ఇబ్బందులు పడుతున్నారని చాలీచాలని వేతనాలు ఇస్తూ ఈ విధంగా పెండింగ్ వేతనాలు పెట్టడం చాలా బాధాకరమైన విషయమని ఇప్పటికైనా పెండింగ్ విత్తనాలను వెంటనే చెల్లించాలని అన్నారు. నంద్యాల పట్టణానికి 42 ఆటోలు వస్తే కేవలం 20 వాహనాలు మాత్రమే తిరుగుతున్నాయని మిగిలిన 22 వాహనాలు పంచర్లు, క్లచ్ ప్లేట్లు, డీజిల్ వేయించలేక మూలకు పడేసినారని వీటివల్ల డ్రైవర్లు ఇంటికే పరిమితమై ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ విషయంలో రెడ్డి ఎంటర్ప్రైజెస్ చాలా ఘోరంగా విఫలమైందని అన్నారు. ఇప్పటికైనా నంద్యాల జిల్లా కలెక్టర్ శాసనసభ్యులు మున్సిపల్ కమిషనర్ స్పందించి రెడ్డి ఎంటర్ప్రైజెస్ నుండి డ్రైవర్లకు వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని, లేకుంటే డ్రైవర్లు ఆందోళన బాట పట్టడం తప్పదని హెచ్చరించారు. రాబోయే కాలంలో డ్రైవర్లు ఏ కార్యక్రమం చేపట్టిన నంద్యాల పట్టణంలో చెత్త సేకరణకు డ్రైవర్లు వెళ్లరని ప్రజలు ఇబ్బందులకు గురవుతారని ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.

# కనుమరుగవుతున్న ప్రాచీన జానపద కళలను కాపాడండి.

**-తిరుపతి తరహా మహానంది క్షేత్రంలో 365 రోజులు పాటు భజనలు జరపండి.**

**-మహానంది క్షేత్రంలో ఆధ్యాత్మిక కళాక్షేత్రాన్ని నిర్మించండి.**

**-తిరుపతి అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విజయ శంకర స్వామీజీ.**



ఆంధ్ర ప్రగతి మహానంది నవంబర్ 07:
మహానంది క్షేత్రంలో జానపద కళాకారులు, భజన బృందాల జిల్లా సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో జానపద కళల ప్రదర్శన జిల్లా సమన్వయకర్త టి .రామచంద్రుడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరుపతి అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ విజయ శంకర స్వామీజీ, మహానంది దేవస్థానం ఈవో చంద్రశేఖర్ రెడ్డి, ట్రస్టు బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరిగిన ఆధునిక టెక్నాలజీ వల్ల, మన దేశంలోని గ్రామీణ జానపద కళలు చెక్కభజన, కోలాటం, హరికథ, బుర్రకథ, పౌరాణిక నాటకాలు, గ్రామీణ దేవాలయాల్లో జరిగే భజనలు రోజురోజుకు కనుమరుగుతున్నాయని, సమాజంలో ప్రజల మధ్య చైతన్యం కలిగించేందుకు ఉపయోగపడాల్సిన కలలు వ్యాపారంగా మారుతున్నాయి అన్నారు. కలలను నమ్ముకుని జీవిస్తున్న కళాకారులు దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారన్నారు. గ్రామీణ దేవాలయాల్లో జరిగే భజనల వల్ల పొద్దస్తమానం కష్టపడి పనిచేసే వారు ఎలాంటి అలసట లేకుండా భజనల వల్ల మానసిక ఉత్సాహాన్ని పొందే వారిని, నేడు భజనలు తగ్గిపోవడం వల్ల మానసిక ప్రశాంతత లేకుండా టెన్షన్ లైఫ్ తో అనేక రకాల వ్యాధులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సోదర భావంతో బ్రతకాల్సిన ప్రజల మధ్య ఈర్ష, ద్వేషాలు పెరుగుచున్నాయని, మద్యపానం, ధూమపానం, జూదం లాంటి చెడు వ్యసనాలకు చాలామంది యువకులు బానిసలు అవుతున్నారన్నారు. కావున అంతరించిపోతున్న జాన పద కలలను సంరక్షించుకోవాలని, తద్వారా ప్రజల్లో చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా చైతన్యం కల్పించాలని, గ్రామాల్లో భజనలు పెంచాలని, అందుకు భజన బృందాలకు ప్రోత్సాహం కల్పించాలని వారు కోరారు. అందుకోసం మహానంది పుణ్యక్షేత్రంలో ఆధ్యాత్మిక, జానపద కళాక్షేత్రాన్ని నిర్మించి కలలను అభివృద్ధి చేయాలని, తిరుపతి తరహాలో మహానందిలో 365 రోజులపాటు భజనలు జరపాలని, భజన బృందాలకు , గురువులకుప్రోత్సాహం కల్పించాలని, భజనలు చేయడం కోసం వచ్చేవారికి కనీస వసతులు సౌకర్యాలు కల్పించాలని పీఠాధిపతి విజయ శంకర స్వామీజీ మహానంది దేవస్థానం ఈవో , చైర్మన్ ని సభ వేదిక ద్వారా కోరారు. అందుకు వారు తమకున్న పరిధిలో పడి భజన బృందాలకు, కళాకారులకు ప్రోత్సాహం కల్పిస్తామని, కలల అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు.
అనంతరం చెక్కభజన గురువులు నల్లగట్ల వెంకటేశ్వర్లు, బోజ్జయ్య, కాసింసాహెబ్, చాకలి వెంకటేశ్వర్లు, సీనియర్ కళాకారుడు గురువైన జి .రామకృష్ణ, మద్దయ్య, వేణుగోపాల్, భజన కృష్ణయ్య, మద్దిలేటి రెడ్డి , నంద్యాల పట్టణ కళాకారుల సంఘం కన్వీనర్ విజయ్ చంద్రుడు, కళామండలి సభ్యులు శివరామిరెడ్డి, ప్రసాద్ శర్మ మాట్లాడుతూ జిల్లాలోని యాభై తాళం భజన బృందాలు , నాలుగు కోలాటం బృందాలు, చెక్కభజన బృందాలు తమ కలలను పగలు, రాత్రి ప్రదర్శించామని అన్నారు. ఈ సందర్భంగా భోజన, వసతి సౌకర్యాలు కల్పించిన దేవస్థానం కమిటీ వారికి,అధికారులకు , సహకరించిన వారందరికీ భజన సంఘాలు,కళాకారులు ధన్యవాదాలు తెలిపారు



# జగన్ సర్కార్ తప్పుడు కేసులపై గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన నారా లోకేష్.



టిడిపి కేడర్ పై 60వేల తప్పుడు కేసులు!
ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పార్టీ సీనియర్ నేతలపై 260 తప్పుడు కేసులు ఎలా పెట్టారో వివరాలతో సహా ఇచ్చాం. రాష్ట్రవ్యాప్తంగా టిడిపి కేడర్, సానుభూతిపరులపై 60వేల కేసులు ఎలా పెట్టారో వివరించాం. నేను యువగళం పాదయాత్ర చేసినపుడు నాపైన, నాయకులపైన, యువగళం వాలంటీర్లు, కార్యకర్తలపైన ఎలా కేసులు పెట్టారో సవివరంగా తెలియజేశాం. పవన్ కళ్యాణ్ ఆనాడు రాష్ట్రానికి రావాలనుకున్నపుడు ఎలా అడ్డుపడ్డారో తెలియజేశాం. రాష్ట్రంలో ప్రజలపై కూడా ముఖ్యమంత్రి ఎలా కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారో చెప్పాం. అమర్ నాథ్ గౌడ్ ను ఎలా చంపారో, దళిత యువకుడు శ్యామ్ కుమార్ ను ఎలా అవమానించారో చెప్పాం, పలమనేరులో పదోతరగతి విద్యార్థిని మిస్బాను వైసిపి నేత వేధించి ఎలా ఆత్మహత్య చేసుకునేలా చేశారు, ఇంకోవైపు జ్యుడీషియరీపై కూడా ఎలా దాడులు చేస్తున్నారో గవర్నర్ దృష్టికి తీసుకెళ్లాం. రాజ్యాంగాన్ని కాపాడాల్సిన బాధ్యత గవర్నర్ పై ఉంది, కాపాడతారని ఆశిస్తున్నాం.
ఎలక్టోరల్ బాండ్లు కూడా అవినీతేనా?
మూడుసార్లు సిఎంగా పనిచేసిన చంద్రబాబుపై ఆధారాల్లేక పోయినా, 17ఎ పర్మిషన్ లేకపోయినా దొంగకేసులు పెట్టి ఎలా సతాయించారో, జ్యుడీషియల్ రిమాండ్ కు ఎలా పంపారో వివరించాం. స్కిల్ కేసులో తొలుత 3వేల కోట్లు అవినీతి అన్నారు, తర్వాత 370 కోట్లు అన్నారు, ఇప్పుడు 27కోట్లు అంటున్నారు. అది కూడా పార్టీ ఎకౌంట్ లో పడ్డాయని చెప్పి ఎలా ఇబ్బంది పెట్టారో చూశాం. సామాన్య ప్రజలకు ముఖ్యమంత్రి సైకో అని అర్థమైంది, ఏ తప్పుచేయని చంద్రబాబుపై చివరకు 27కోట్లు పార్టీ అకౌంట్ కు వచ్చిందని ఆరోపణలు చేస్తున్నారు. మూడుసార్లు ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తిపై 27కోట్లు అవినీతి జరిగిందని ఆరోపణలు చేస్తారు, అది కూడా ఎలక్టోరల్ బాండ్ల గురించి, ఎవరైనా వింటే నవ్విపోరా? 2014నుంచి వైసిపికి ఎకౌంట్ లోకి 150కోట్లు ఎలా వచ్చాయి, వారికి ఎలాంటి ఖర్చులు లేవా?
తప్పుడు కేసులపై న్యాయపోరాటం చేస్తాం!
17ఎకి 2018లో సవరణ వచ్చింది, చంద్రబాబుపై కేసు విషయంలో పర్మిషన్ తీసుకోవాల్సి ఉండగా తీసుకోలేదని చెప్పాం, వివరాలన్నీ తెప్పించుకుంటామని చెప్పారు. భయం మా బయోడేటాలో లేదు%ా% పోరాటమే, అడ్డొస్తే తొక్కుకుంటా పోతాం. చంద్రబాబు ఇంటీరియమ్ బెయిల్ పై ఉన్నారు, 10వతేదీనుంచి రెగ్యులర్ బెయిల్ పై విచారణ ఉంది, వచ్చే తీర్పులను బట్టి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తాం. ఈ ప్రభుత్వంలో దొంగ కేసులు పెట్టడం అనివార్యం, రాష్టస్థాయి నుంచి గ్రామ కార్యకర్త వరకు కేసులు పెడుతున్నారు, న్యాయపోరాటం చేస్తాం. టిడిపి కార్యకర్తలకు న్యాయసహాయం అందిస్తున్నాం, కార్యకర్తలను కాపాడాల్సిన బాధ్యత మాపై ఉంది, కాపాడుకుంటాం. నేను, అచ్చెన్నాయుడు వ్యక్తిగతంగా చూస్తున్నాం.
రాష్ట్రంలో ఓటర్ల జాబితా అవతకతవకలపై రేపు టిడిపి బృందం ఎన్నికల కమిషన్ ను కలుస్తుంది, 6లేఖలు ఇస్తాం, తప్పుల తడక ఓటరు లిస్టుపై ఫిర్యాదు చేస్తాం, ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్తాం. దొంగఓట్లపై మేం పోరాడతాం, ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్తాం, డిల్లీకి కూడా వెళ్లి పోరాటం కొనసాగిస్తాం. ముఖ్యమంత్రి ఫోటోతో కూడా దొంగఓటు ఉంది, సిఎం 38కేసుల్లో దొంగ, 10సంవత్సరాల కేసుల్లో బెయిల్ పై తిరుగుతున్న దొంగ, సొంత బాబాయిని లేపేసిన వ్యక్తి జగన్, అవినాష్ రెడ్డిని కాపాడటానికి సిబిఐని ఎపికి రానీయకుండా చేశారు. దొంగనుంచి మంచి పరిపాలన ఎలా ఆశిస్తాం? జగన్ పై 38కేసులు ఉన్నాయి, 11సిబిఐ, 7 ఈడి కేసులు ఉన్నాయి. పదేళ్లుగా బెయిల్ పై తిరుగుతున్నాడు, ఏ తప్పు చేయని చంద్రబాబును 38కేసులున్న వ్యక్తి 53రోజులు జైలులో ఉంచాడు, అందుకే రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం అమలవుతోందని అంటున్నాం. 2019నుంచి రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం అమలవుతోంది.
నాయకులంతా ప్రజల్లోనే ఉన్నాం!
ఎన్ని అడ్డంకులు సృష్టించినా నాయకులందరం ప్రజల్లో ఉన్నాం, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీపై ఇంటింటికీ తిరుగుతున్నాం, ప్రతిపక్షనేతలపై దాడులను కూడా ప్రజలకు తెలియజేస్తున్నాం. టిడిపి-జనసేన అధికారంలోకి వచ్చాక ఏం చేస్తామో చెబుతున్నాం. జెఎసి మీటింగ్ లో కూడా టిడిపి సూపర్ సిక్స్ పథకాలను జనసేనకు వివరించాం, చాలా బాగుతున్నాయని అన్నారు, పవన్ కొన్ని అదనంగా సూచించారు. వాటిపై జెఎసి మీటింగ్ లో చర్చిస్తున్నాం. రాష్ట్రంలో కరువు తీవ్రంగా ఉంది, రైతాంగం తీవ్రంగా నష్టపోతోంది, పశ్చిమప్రాంతంలో తాగునీటికి కటకటలాడుతున్నారు, దీనిపై ఉద్యమం చేయాలని నిర్ణయించుకున్నామని లోకేష్ తెలిపారు. గవర్నర్ ను కలిసిన వారిలో టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్సీ అశోక్ బాబు, మాజీమంత్రులు కొల్లు రవీంద్ర, పీతల సుజాత, ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ నరేంద్ర తదితరులు ఉన్నారు

# వైసిపి పై వ్యతిరేకత సరే .. టిడిపికి గెలుపు గుర్రాలక్కర్లేదా..?

బలహీన అభ్యర్థుల ఎంపికతో బలమైన వైసీపీని ఎలా ఎదుర్కొంటారని ప్రజల ఆశ్చర్యపోతున్నారు. టీడీపీ వైఖరిపై రాబిన్ శర్మ స్ట్రాటజీ టీం కూడా అసంతృప్తిగా ఉన్నట్టు తెలుస్తోంది. వైసీపీపై వ్యతిరేకతతోనే అధికారం చేతిలోకి రాదు.. సరైన అభ్యర్థులు కూడా ఉండాలని సూచిస్తున్నారు. చంద్రబాబు అనుకున్నట్టుగా అదే టీంతో వెళ్తే మాత్రం వైసీపీకి ఘన విజయం అందించినట్టేనని అంటున్నారు.
దీనికి పలువురు అభ్యర్థులను ఉదాహరణగా తీసుకోవచ్చు.. నంద్యాల జిల్లా కేంద్రం లోని నంద్యాలఅసెంబ్లీ నియోజకవర్గాన్నే తీసుకుంటే అక్కడ ఎన్ఎమ్ డీ ఫరూక్ కు టికెట్ ఖరారు చేశారని ప్రజలు చర్చించుకుంటున్నారు. అదేవిధంగా నంద్యాల ఎమ్మెల్యే సీటు తమకే కేటాయించాలంటూ భూమా వర్గీయులు కోరుతున్నారు. కానీ భూమా నాగిరెడ్డి మరణం అనంతరం నంద్యాల టిడిపి సీటును భూమా వారసునిగా బ్రహ్మానంద రెడ్డికి టికెట్ను ఖరారు చేస్తూ పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. అయితే బై ఎలక్షన్ లో భూమా బ్రహ్మానందరెడ్డి ఘనవిజయం సాధించారు. అనంతరం 2019లో కూడా భూమా బ్రహ్మానందరెడ్డి కి టిడిపి అధిష్టానం నంద్యాల టికెట్ను కేటాయించింది. అయితే ఈ ఎన్నికల్లో భూమా పరాజయం పొందారు. అనంతరం నంద్యాల నియోజకవర్గ బాధ్యతలను టిడిపి అధిష్టానం భూమా బ్రహ్మానంద రెడ్డికి కేటాయించడంతో పార్టీ కార్యక్రమాలన్నింటినీ తానే నిర్వహిస్తున్నారు. అదేవిధంగా తెలుగుదేశం పార్టీ స్థాపించిన నాటినుండి నేటి వరకు మాజీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడిగా మరియు పొలిట్ బ్యూరో సభ్యులుగా తెలుగుదేశం పార్టీకి అనేక సంవత్సరాలుగా సేవలందిస్తూ వస్తున్నారు. ఇలాంటి తరుణంలో మాజీ మంత్రి ఫరూక్ మరియు మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి లు నంద్యాల టికెట్ విషయంలో ఎవరికివారు తమకే కావాలంటూ పట్టు పట్టడంతో నవంబర్ 8వ తేదీన మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయానికి రావాలంటూ ఇరువురి నేతలతో పాటు, నంద్యాల నియోజకవర్గంలోని టిడిపి నేతలకు అధిష్టానం నుండి పిలుపు వచ్చింది. అయితే అధిష్టానం నిర్ణయం మేరకు నేతలు నడుచుకోవాల్సి ఉంటుంది. అదేవిధంగా డోన్ లోనూ అలాంటి పరిస్థితే నెలకొన్నది. సుబ్బారెడ్డిని అభ్యర్థిగా చంద్రబాబు ప్రకటించారు. డోన్ లో మంత్రి బుగ్గన రాజేంద్ర రెడ్డిని ఎదుర్కొనే సత్తా సుబ్బారెడ్డికి లేదనే మాట వినిపిస్తోంది. తరచుగా కె కృష్ణమూర్తి సోదరులు కేఈ ప్రతాప్ డోంట్ టిడిపి సీటు నాదేనంటూ చెబుతూ ఉండంతో ఒకంత గందరగోళం నెలకొన్నది. ఆళ్లగడ్డలో వైసీపీ ఎమ్మెల్యే గా గంగుల నాని ఉన్నారు. కానీ అక్కడ టీడీపీ ఇన్ చార్జిగా మాజీ మంత్రి అఖిలప్రియ కొనసాగుతున్నారు. టిడిపి తరఫున పోరాటం చేస్తూ ప్రజలకు అండగా నిలబడుతున్నారు. కానీ అదే సమయంలో భూమా కుటుంబం నుంచి కిషోర్ రెడ్డి బిజెపి పార్టీ నుండి పల్లెనిద్ర కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వెళుతూ ప్రజల అభిమానాన్ని పొందుతున్నారు. భూమా కుటుంబంలోని వారందరూ ఒక తాటిపైకి వచ్చినట్లయితే ఆళ్లగడ్డ నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగడం ఖాయమని పలువురు చర్చించుకుంటున్నారు.
తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో బొజ్జల సుధీర్ రెడ్డి, చిత్తూరు జిల్లా పూతలపట్టు అభ్యర్థిగా మురళీమోహన్, ప్రొద్దుటూరులో జి.ప్రవీణ్ కుమార్ రెడ్డి, కమలాపురంలో పుత్తా నరసింహారెడ్డి, నెల్లూరు జిల్లా సర్వేపల్లి నుంచి సోమిరెడ్డి, పాయకరావుపేటలో అనిత తదితర బలహీన మైన అభ్యర్థులను నిలబెడితే టీడీపీ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని విశ్లేషకులు అంటున్నారు. వీరి స్థానాల్లో వైసీపీ ఎమ్మెల్యేలపై కొంత వ్యతిరేకత ఉన్నప్పటికీ.. టీడీపీ బలహీన అభ్యర్థులను నిలబెట్టే అవకాశం ఉండడంతో.. ఆయా నియోజకవర్గాల్లో వైసీపీ అభ్యర్థుల విజయఢంకా మోగించే అవకాశాలు కనపడుతున్నాయి.
ఇదే తరహాలో జనసేన వ్యూహం కూడా పనికొచ్చే విధంగా లేదు. జనసేనలో ప్రధాన నేత నాదెండ్ల మనోహర్ తెనాలి నుంచి పోటీ చేయనున్నారు. అయితే అక్కడి జనాలతో ఆయనకు పరిచయమే లేదు. మొన్ననే పార్టీ ఆఫీసును ఓపెన్ చేయడంపై అక్కడ జనసేన బలమేంటో తెలుస్తోంది. వైసీపీ వ్యతిరేకత లాభిస్తుందని టీడీపీ, జనసేన అధిపతులు అనుకున్నప్పటికీ వైసీపీ బలహీన స్థానాల్లోనే వారి వ్యూహం ఇలా ఉంటే ఇంకా బలమైన వైసీపీ నేతలను ఎలా ఎదుర్కొంటారోనని ప్రజల చర్చించుకుంటున్నారు.

# బిఎంపి అభ్యర్థి గ ప్రకాష్ రాథోడ్ నామినేషన్ దాఖలు.

(సంగారెడ్డి
నారాయణఖేడ్ నియోజకవర్గం అసెంబ్లీ బిఎంపి అభ్యర్థి ప్రకాష్ రాథోడ్ నారాయణఖేడ్ పట్టణంలో సోమవారం అభిమానుల మధ్య మొదటి ఎమ్మెల్యే నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా డప్పు చప్పుళ్ళతో అభిమానుల కేరింతలతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం ఆర్డిఓ ఆఫీస్ లో నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల మద్దతు అనూహ్యంగా రోజురోజుకీ బిఎంపి పార్టీపై పెరుగుతుందని, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి జరగాలంటే నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో బిఎంపి అభ్యర్థికి మంచం గుర్తు పైన ఓటేసి ఘన విజయానికి కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బిఎంపి నాయకులు దాసు రామ్ నాయక్ బహుజన ముక్తి పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరిన బి ఆర్ ఎస్,బిజెపి పార్టీ కార్యకర్తలు.

చౌటకూర్)
సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుభాష్ రెడ్డి మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో పి పి ఆర్ గార్డెన్ లో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శాశ్వత సభ్యులు కాంగ్రెస్ పార్టీ ఆందోల్ శాసనసభ అభ్యర్థి దామోదర్ రాజనర్సింహ సమక్షంలో బిఆర్ఎస్, బిజెపి పార్టీలకు నాయకులు కార్యకర్తలు కురుమ సంఘం నాయకులు, నాయి బ్రాహ్మణ సంఘం సభ్యులు, రజక సంఘం సభ్యులు భారీ ఎత్తున సుమారు 300 మంది కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో పార్కల రామ్ రెడ్డి, టిఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షులు సార గోవర్ధన్, ప్రభాకర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, రామచంద్ర రెడ్డి, కోల్కూరి కిషన్, మన్నె లింగయ్య, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గారెల నరసింహులు, నత్తికిష్టయ్య, పుట్టి పోచయ్య, నాగరాజు, దూడలింగమయ్య, నారాయణ గౌడ్ గురువు, పెంటయ్య, మైనార్టీ సెల్ నాయకుడు ఖలీల్ ఇతర సీనియర్ కార్యకర్తలు ఉన్నారు. సరాఫ్ పల్లి, సుల్తాన్పూర్, ఎస్ ఇటిక్యాల్, మరియు మునిపల్లి, రేగుడ్ మండలాలకు సంబంధించిన బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నత్తి దశరథ్, ఉపాధ్యక్షుడు రామా గౌడ్, మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు కైసర్, గ్రామ అధ్యక్షుడు వరకల రమేష్, ప్రధాన కార్యదర్శి ఆగమయ్య, ఉపాధ్యక్షుడు ఆబేద్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తార్డన్ పల్లి రవీందర్ మండల సీనియర్ నాయకులు జైపాల్ రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు కృష్ణ, మైనార్టీ సెల్ అధ్యక్షులు షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.